


# రవ్వుంగరం

కొండపల్లి కోటేశ్వరమ్మ

వేకువ రేకులు విచ్చుకుంటోంది. నిద్రను కప్పుకున్న నగరం నింపాదిగా తొలగించుకుంటూ వొళ్ళు విరుచుకుంటూ కళ్ళిప్పుతోంది. కాలువగట్టు దిగువ నున్న గుడిసెలో ఇద్దరు కుర్రాళ్ళు చూరులో నుంచి చూసి తెల్లారిందని తెలుసుకున్నారు.

గారపట్టిన పళ్ళు కనిపించేలా ఆవులిస్తూ, పుసులు కారే కళ్ళను నులుపుకుంటూ, చింపిరి జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి గోక్కుంటూ ఒకడ్ని ఒకడు చూసుకుంటూ లేచారా ఇద్దరూ.

"అమ్మ మల్లివాదిలేపి మనకంటే ముందే... పాచిపని చెయ్యనో....పూసలమ్మనో పోయిందిరా...!" పెద్దాడన్నాడు. "మల్లి ఆకలేసి రాత్రంతా ఏడ్చింది కదరా! వెళ్తే మళ్ళీ ఏడుస్తుందనీ, సద్దిబువ్వ దొరికితే తె ద్దామని ఎల్లుంటుందిరా! మల్లికంటే ముందే మనం లేవాంగదరా! అమ్మలాగ మనం పోదాంరా!" ముడుచుకు నిద్రోతున్న చెల్లిని చూస్తూ...చిన్నాడన్నాడు. వాళ్ళిద్దరూ...గుడిసె నుండి బైటకొచ్చారు.

మురికి కాలువలో పురుగుల కోసం నోళ్ళు తెరుచుకుని ఎగిరే కప్పల్ని చూస్తూ గట్టు దాటి రోడ్డెక్కారు వాళ్ళు. పోగులు పడ్డ చెత్తా—చెదారంతోనూ పగిలిన గాజు పెంకుల్తోనూ... ఉల్లిపాయల, కూరగాయల తొక్కులతోనూ... కోడిగుడ్డు డొల్లలతోనూ, కుళ్ళుతున్న రోడ్డు మున్సిపాలిటీ బండి కోసం చూస్తుంటే...వాళ్ళిద్దరూ ఎగిరే కాగితాల వెంట పడ్డారు. లోకం విసర్జించి విసిరేసిన ప్రతిదాన్నీ పట్టుకుని చూస్తున్నారు. పరుగులు తీసే వాళ్ళ చిరుపాదాల సవ్వడి వింటూ...ధూళి లేపుతూన్న వాళ్ళ పాదాలు...ఆ కలితో తేలిపడిపోకుండా...నేల తల్లి నిలబడేటట్లు చూస్తుంది. ధూళి, దుర్గంధం కమ్ముతున్న వాళ్ళ దేహాల్ని నింగి అరుణ కాంతులతో తుడుస్తూంది.

"ఇయ్యాల లేసినేల చానా మంచిదిరా! ఒకటొకటి ఏదో...దొరుకుతానే వుంది" కాఫీ హోటల్ ముందు పారేసిన ఆకుల్లోని ఉడకని ఇడ్లీ ముక్కల్నీ, చల్ది వాసన కొడుతూన్న పచ్చడినీ...తీసుకుని తింటూ సంబర పడుతున్నారు.

మిఠాయి దుకాణం దగ్గర పాసి పోగులో కనిపించే పాలుకులను కాకులతో కలబడి ఏరుకుంటూ "యియ్యంటే...మల్లికిస్తంరా!" చిన్నాడు అన్నాడు. జఠరాగ్ని మంటల తీవ్రత నాపుకున్న వాళ్ళు ఇక మనం ఏది దొరికినా తినొద్దురా! ఇంటికట్టుకెళదాంరా!" తీర్మానించుకున్నట్టు అనుకున్నారు.

ప్రతి కొట్టు ముందూ, ఇంటి ముందూ ఆగుతూ పడి వున్న వాటిని ఎక్సరే చికిత్స చేసి బయటకు లాగుతూ నడుస్తున్నారు వాళ్ళు. ఓ ఇంటి ముందు చెత్త నుప్పలో కుంకుడు తుక్కులో తళ తళ మంటున్న దాన్ని చూసి మిణుగురనుకున్నాడు పెద్దాడు. 'పగలు మిణుగురులు కనిపించవంటారుగా? ఆలోచిస్తూ తల గోక్కుంటూ దాన్ని తీశాడు. కళ్ళు మిరుమిట్లు గొలుపుతూ చేతిలో కొచ్చింది ఉంగరం. బంగారు ఉంగరం భలే భలే అంటూ చంక లెగరేసుకుంటూ "ఒరే! దీన్ని చూడరా జిగేలంటోంది" తమ్మునికి చూపుతూ ఉబికే ఉత్సాహాన్ని ఆపుకుంటూ ఎవరైనా తమ తీసినప్పుడు చూశారేమోనని అటూ ఇటూ చూశాడు. ఒక చేత్తో తమ్ముడి రెక్కట్టుకుని ఒక చేతి గుప్పెట్లో ఉంగరాన్ని బంధించి "ఊ పదరా! వెళ్ళిపోదాం" అని ఛంగున పరుగు లంకించుకున్నాడు.

ఎదురుగా ఏమొచ్చేదీ తెలీని సంబరంతో ఉరుకుతూనే "ఉంగరం మల్లి చేతికెడదాంరా!" తమ్ముడన్నాడు. "అమ్మకిద్దాంరా!" అన్నాడు అన్న. "అమ్మకిద్దాంగానీ అయ్యకీయొద్దు...వాడు చాలా చెడ్డ మనిషి. అమ్మ లేకుండా చూసి మనల్ని కొట్టేస్తాడు. కదూ?" తమ్ముడడిగాడు.

"ఆడికి ఉంగరాన్ని సచ్చినా చూపెట్టను. మన దగ్గర ఉన్నట్టు కూడా చెప్పను. వాడికి తెలిస్తే మనం దొంగిలించామనీ, పోలీసోళ్ళకి పట్టిస్తానని

అమ్మని భయపెట్టే...మాయ చేసి లాక్కుంటాడు. అమ్మి అన్నీ తెస్తానని అమ్మని మోసగిస్తాడు. అట్టుకెళ్ళి సారాయి అమ్మేవానికిచ్చి సీకలదాకా తాగొచ్చి మనల కొట్టేస్తాడు. అసలు వాడు మనయ్య కాడట. మనయ్య సచ్చిపోయినాడట. అమ్మేడుస్తుంటే ఏమేమో సెప్పి గుడిసె కొచ్చి ఇక్కడే వుండిపోయినాడంట. పనీ పాటల కెళ్ళక అమ్మెట్టింది తినీ, ఎట్టకుంటే కొట్టే...ఆబోతు లాగా తిరుగుతున్నాడంట. చెప్పులు కుట్టే తాత యీ అయ్య కథ సెప్పాడు. మనయ్య చానా మంచోడంట. మనకన్నీ తెచ్చి పెట్టే ఓడంట. ఈ దొంగ నాయాలికి ఉంగరం సంగతి సెప్పనంటే సెప్పను'' ఉద్రేక పడుతూ అన్నాడు పెద్దోడు.

గుడిసె దాపు కొచ్చిన వాళ్ళకి...మల్లి ఏడుపు వినిపించింది. గుడిసెలో కాలెట్టిన వాళ్ళకి ముంజేతులతో కారే ముక్కును తుడుచుకుంటూన్న మల్లి కనిపించింది.

సగం కుళ్ళిన నారింజ పండు, బూజు పట్టిన బ్రెడ్ ముక్కలు మల్లికిస్తూ కన్నీటిని చిరిగిన చొక్కాతో తుడుస్తూ "తిను మల్లీ...తిను...నిడవకే'' చిన్నాడన్నాడు. గుప్పెట్లో యిమడక గులగుల్లాడే ఉంగరాన్ని తీసి 'మల్లీ నీ వెయ్యేదే...? అంటూ...మల్లి వేలికి ఉంగరాన్ని తొడుగుతూ. ..మల్లి నుదురును ముద్దెట్టుకున్నాడు పెద్దోడు. ఉంగర మెట్టుకున్నోళ్ళ యేళ్ళు పొంగన పూరీలు తినీ, ఉబ్బిన ఇడ్డెన్లు తినీ పంది కొక్కుల్లాగ లావెక్కాయేమోరా! ఉంగరం పతి యేలును పట్టుక్కుండేదేమోరా! మల్లేళ్ళు పుల్లలు గదరా? ఏ యేలు కెట్టినా జారతానే వుంది ఉంగరం'' చిన్నాడు ఉంగరం మల్లి బొటన వేలుకు తొడుగుతూ అన్నాడు.

మురిసిపోతున్న ఆ ముగ్గురి ముఖాల్లోని వెలుగును చూస్తూ నెత్తినున్న బుట్టను నేల మీద పెడుతూ "మంచి నీళ్ళ కుండ తెండిరా...బువ్వెడతాను. మల్లీ! ఈ దినం నిన్ను చూస్తా లేచానే! తల్లి మాలాచ్చి బుట్టెడు బువ్వెట్టిందే! నీ పిల్లల కెట్టండే!'' అన్నం కలుపుతూ...తల్లి మల్లిని చూసి ఆగింది. మల్లి వేలికి మెరుస్తున్న ఉంగరం చూసి ఉలిక్కిపడింది. కండ్లు తిరిగి పట్టై మూసుకుంటూ "అదెక్కడిదిరా?" అని ఆశ్చర్యంగా అడిగింది. అమ్మ వాలకం చూసిన పెద్దోడు భయం భయంగా "దొంగతనం చేయలేదు. దొరికిందే'' అన్నాడు.

ఆ పేదరాలికి లేచిన దగ్గర నుండి గుడిసె దగ్గరికొచ్చేంత వరకూ తను పడిన పాట్లు రింగులు రింగులుగా తిరుగుతూ ఉంగరం మెరుపులో కనిపిస్తున్నాయి.

"నల్లపూసలు, కాశీదారాలు, శ్రీగంధం, సినార్ రంగు కుంకం కొనండమ్మా! పండగ పూజకు పనికొస్తాయి. రండి!'' గొంతు చిరిగేటట్లు ఇంటింటి ముందూ ఆగుతూ...పిలుస్తూ...ఒక్కరూ పిలవకుంటే నడుస్తూ...నిరుత్సాహపడుతూ నీరసంతో ఒక గోడ నీడను నిలబడింది. పూలు కొంటున్న ఒక ఆమెను చూసి 'అమ్మా!' అని పిలుస్తూ తన వద్ద నున్న వాటిని కొనమని ఇంటింటి వద్ద పాడిన పాట నేకరువు పెట్టింది.

ఆ ఇంటామె ఎగాదిగా చూస్తూ "అవి మాకొద్దుగానీ...అంట్లు తోమి పెట్టగలవా? ఓ పూసలమ్మీ? అన్నం పెడతా''నంది. "పండుగ




గదా...పనిపిల్ల గదులు కడుగుతుంది వంట వేళైంది. గిన్నెలు కావాలి!'' పని చెప్పినందుకు ఏమైనా అనుకుంటుందేమోనన్నట్టు చెప్పింది.

అంట్లు తోమను అంగీకరించిన పూసలమ్మికి అంట్లు చూపెట్టి...లోనికెళ్ళిన ఆమె మరికొన్ని గిన్నెలు తెచ్చి ''అన్నం, కూరా, పులుసు వుంది. ఏదేని పట్టు పెడతానంది. బుట్టెడు అన్నం చట్టెడు పులుసూ యిచ్చింది. కాసేపైన తరువాత గిన్నెల కోసమొచ్చి తృప్తిగా చూస్తూ ''ఆకలేస్తున్నా కాదనక అడిగిన వెంటనే ఒప్పుకున్నావు. నాళ్ళు వంచి పని చేశావుగా కాబట్టే గిన్నెలు తెల్లగా మెరుస్తున్నాయి. ఎండబడుతుంది...పూజ తొందరలో ఈ రోజు నీ పూసలు అమ్ముడు కాకపోవచ్చు. పిల్లలున్నారా? ఉంటే వాళ్ళకింత పెట్టి నీవు కూడా అన్నం తిను. ఇక వెళ్ళు'' అంది. ఆమె కృతజ్ఞతా భావంతో పూసలమ్మి కుంకుమ పొట్లం ఇవ్వబోయింది. ''ఓసీ వెర్రిదానా! అమ్ముకుంటే అర్ధ రూపాయొస్తుంది. ఉచితంగా మాకెందుకూ యివ్వడం? జాప్యం చేయకుండా వెళ్ళు పిల్లలు చూస్తూ వుంటారు'' అని లోనికెడుతున్న ఆమె వెనుకకు తిరిగి ''అమ్మీ! సాయంత్రం ఒకసారి కనిపించు...అంట్లు తోమను కాదు నేపిలిచేది. అప్పచ్చులెట్టి పంపుతాను'' చిరునవ్వుతో చెప్పి వెళ్ళింది లోనికి.

కరువైన కనికరం కనిపించినట్లై...సంబరంగా ఆమె వంక చూస్తూ నిలుచున్న పూసలమ్మికి ''పిల్లలు చూస్తూ వుంటారనే'' ఆమె మాట చెవిని మోగినట్లైంది.

బైటకొచ్చిన పూసలమ్మికి దొడ్డి గుమ్మం దగ్గర లంగా ఓణీ వేసుకున్నమ్మాయి, చీర కట్టుకున్నామె కనిపించారు. ఇద్దరూ చెత్త కుప్పలో చేతులు పెట్టి దేని కోసమో వెతుకుతున్నట్టున్నారు.

''అమ్మా! మీరు కుంకుడు రసమున్న గిన్నెలో వేశారో? మరెక్కడైనా పెట్టారో? గుర్తు తెచ్చుకోండి'' పరికిణీ కుచ్చిళ్ళు పైకి దోపుకుంటూ ఆతురతగా అడిగింది చిన్నపిల్ల.

''నాకు గుర్తుందే...తలంటు కుంటుంటే ఉంగరం జారింది. స్నానమైన తరువాత కడిగి పెట్టుకోవచ్చనీ, కండ్లు తెరిస్తే...కుంకుడు నీళ్ళు పడతాయనీ...చేతి దగ్గర గిన్నెలో వేశాను. ''చప్పున తెమిలిరా...!'' అన్న అమ్మ కేక విని హడావుడిగా స్నానం చేస్తూ ఉంగరం మాట మరిచిపోయాను. బట్టలేసుకుని బొట్టెట్టుకుంటుంటే గుర్తొచ్చి బాత్ రూము కొచ్చాను. గిన్నె కనిపించలేదు. గిన్నె తీసిన నీకు కనిపించి వుంటుంది కదా? అని అడిగానే!'' దిగులుతో అంటోంది చీరగట్టినామె.

''ఉంగరం కనిపించకపోతే నేనే తీశానంటారు. పని పిల్ల కాకుంటే ఎవరు తీస్తారన్న మాట విని మా అయ్య ఉంగరం తీశావా? నా పరువు తీశావా? చెప్పని తంతాడు. మీ పెద్దాళ్ళు నన్ను పోలీసులకు పట్టిస్తా రు కూడాను'' ఆగని కన్నీటిని తుడుచుకుంటూ అంటుందా పిల్ల.

''ఏడవకే! వెతుకుదాం. దొరకక పోదులే! అది కనిపించకుంటే...అమ్మ నీకంటే...అతిగా బాధపడుతుంది. అది రవ్వుంగరమే! అది కొన్న తరువాత నాకు సంబంధం ఖాయమైనదట. మాకు కలిసొచ్చిందట. కళ్ళు తుడుచుకుని కుంకుడు తొక్కు ఎక్కడేశావో చూడు'' అంది ఆమె.

''వంట వేళ దాటిందనీ, అంట్లు తోమలేదని పెద్దమ్మగారు అరుస్తారనీ త్వర త్వరగా గదులు కడిగి...బాత్ రూమ్‌లోని కుంకుడు తొక్కంతా గిన్నెలో కెత్తి గిన్నెలోని దంతా చెత్త బుట్టలో వేసి చెత్త బుట్టని తెచ్చి ఇక్కడే బోర్లించానమ్మా!'' కళ్ళొత్తుకుంటూ అంది పిల్ల. ఆ దృశ్యం కళ్ళ ముందు తిరిగిందిప్పుడు పూసలమ్మికి.

పెద్దాణ్ణే కళ్ళిప్పి చూస్తూ...''ఉంగరం ఎక్కడ దొరికిందిరా...? వెంకటేశ్వర స్వామున్న నీధిలో నేనా...? చెత్త కుప్పలో కుంకుడు తుక్కులో నేనా? చెప్పరా'' అరిచినట్లడిగింది.

''అవునే! అక్కడేనే! కుంకుడు తుక్కులోనే...'' అమ్మ చూసుంటుందనుకుంటూ అన్నాడు పెద్దాడు.

ఆకలి తీర్చనింత అన్నం పెట్టిన తల్లికి బాధ కలిగిస్తూ ఆమె పనిపిల్లను జైలుకు పంపిస్తూ... ఆమె బిడ్డను ఉసూరుమనిపిస్తూ ఉంగరాన్ని దాచేయడమా...? నా వల్ల కాదు. ఆకలి బాధకంటే ఈ బాధ అధికం. ఆ అన్నం పెట్టిన తల్లి కంతా చెప్పేస్తాను. ఉంగర మిచ్చేస్తాను. అప్పచ్చులెట్టమని అడుగుతాననుకుంటూ మళ్లి చేతినున్న ఉంగరం తీసి కొంగున కట్టుకుని మంచి పని చేస్తున్నాననే ఉత్సాహంతో పరుగులు తీసే చైతన్య రథంలా వీధిని నడుస్తోందా... పిల్లల తల్లి!

## ధనం

ధనం తేనె వంటిది. తేనె ఈగలను ఆకర్షిస్తుంది. ధనం ఒక రకమైన ఈగ జాతి మనుష్యులని ఆకర్షిస్తుంది.

మనుష్యులలో ధనం సంపాదించే వాళ్లు మూడు జాతులుగా తయారవుతారు. వాళ్ళు ధనం పోగుచేయడంలో ఆనందం, ధనం పెంచడంలో పరమార్థం ధనం పెరగడమే. రెండో రకం వాళ్లు తాము సంపాదించిన ధనం, తాము సంతృప్తిగా అనుభవించాలని కోరుకుంటారు. మూడో రకం వారు తాము సంపాదిస్తున్నట్లు లోకానికి తెలియాలి. తమ ఐశ్వర్యము చూసి లోకం దిగ్భ్రమ చెంది అసూయపడి పోవాలి. అది వారి కానందం. – అడివి బాపిరాజు

(జాజిమల్లి)

సేకరణ: 'బంటి' (మద్రాసు)

## భమిడిపాటి వారి తడాఖా

శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారు, ఎంత నవ్విస్తూ వుండేవారో, అంత సీరియస్‌గా వుండేవారు. ఆయన మాటలు వింటే నవ్వు వచ్చేది. కాని ఆయనంటే అందరికీ గౌరవం, భయం వుండేవి.

ఓమారు ఏమైందంటే —

మేం విద్యార్థులుగా వున్నప్పుడు ఆచారం ప్రకారం భమిడిపాటివారి కొత్త నాటకం తీసుకుని ప్రాక్టీసు ప్రారంభించాం. రాత్రి భోజనాలయ్యాక రెండు హాస్టల్ బ్లాక్స్‌కీ మధ్యన రిహార్సల్స్ జరిగేది. రిహార్సల్స్ చూడ్డానికి పది పదిహేనుమంది విద్యార్థులు వచ్చి కూర్చునేవారు కాని వాళ్ళ దగ్గర లైటు వుండేది కాదు. ఉన్న ఒక్క బల్బూ, మినుకూ మినుకూ మంటూ రిహార్సల్స్ జరిగే స్టేజి మీదే వుండేది. రిహార్సల్స్ జరుగుతున్నాయి. నేను ప్రాంప్టింగ్ చెబుతున్నాను. ఉన్నట్టుండి చూస్తూన్న జనం వెనక నుంచి 'ఆగండి' అని గొంతు వినిపించింది. చూస్తే, కామేశ్వరరావు మేష్టారు! మఫ్లర్ తలకి చుట్టుకుని రిహార్సల్స్ చూడ్డానికి వచ్చినట్టున్నారు. ''యాక్టరు అన్నదేవిటి?'' అని అడిగారు. ''రా రా నా శక్తి చూపిస్తా అన్నానండి'' అన్నాడు యాక్టరు. ''ఒరేయ్ పోలాప్రగడా! స్క్రిప్ట్‌లో ఏ వుందో చదువు'' అన్నారు. ''రా రా నా తడాఖా చూపిస్తా'' అని ఉంది. అది చదివి, తడాఖాకి బదులు శక్తి అన్నాడండి. ఇందులో ఏంపోయింది?'' అన్నాను. వెంటనే ఆయన కోపంగా ''ఏం పోయిందా? నాటకంలో పట్టు పోయింది. బలం పోయింది. రక్తి పోయింది. అన్నింటికంటే రచయిత మీద గౌరవం పోయింది'' అన్నారు. అంతే — ఆ తర్వాత ఆయన నాటకం ఎప్పుడు వేసినా ఒక్క పొల్లుపోతే ఒట్టు. అక్షరం తేడా రానివ్వలేదు మేం.

—పోలాప్రగడ